# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక

సంచిక : 369 | సంపుటి : 2 | తెలంగాణ ఆంధ్రప్రదేశ్ | గురువారం | 27-2-2025 | వెల : .రూ. 5.00

## విలేకరులు కావలెను

తెలంగాణ & ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు
- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు
- RC ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు

-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా WHATS APP నంబర్:- 9705770909 సంప్రదించండి.



# మెట్రో విస్తరణకు నిధులివ్వండి




**ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగాన్ని మంజూరు చేయండి**

- హైదరాబాద్ మెట్రో ఫేజ్-2 కు అనుమతి ఇవ్వండి
- మూసీ పునరుజ్జీవన ప్రాజెక్ట్ కు నిధులు ఇవ్వండి
- రీజినల్ రింగ్ రైల్... డ్రైపోర్ట్‌లు మంజూరు చేయండి
- సెమీ కండక్టర్ మిషన్‌కు అనుమతించండి
- ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వినతి

న్యూఢిల్లీ,ఫిబ్రవరి 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)

హైదరాబాద్ మహా నగరంలో మెట్రో రైలు సౌకర్యం అన్ని ప్రాంతాలకు అందుబాటులోకి ఉద్దేశించిన హైదరాబాద్ మెట్రో రైల్ ఫేజ్-2కు అనుమతించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వం పదేళ్లుగా హైదరాబాద్ -మిగతా 2 లో



## కుంభమేళాలో హరహరమహదేవ్

- భారీగా తరలివచ్చిన భక్తజనం
- చివరిరోజు..శివరాత్రి కావడంతో పుణ్యస్నానాలు

ప్రయాగ్‌రాజ్,

ప్రయాగ్‌రాజ్‌లో అత్యంత వైభవంగా మొదలైన మహాకుంభమేళాకు చివరి రోజు కావడంతో లక్షలాదిగా భక్తులు తరలివస్తున్నారు. మహాశివరాత్రి కావడంతో భక్తులు పుణ్యస్నానాలకు పోటెత్తారు. పుణ్యతిథి కావడంతో భారీగా భక్తుల తరలివచ్చారు. జనవరి 13న మొదలైన ఈ ఆధ్యాత్మిక వేడుక ఇక ముగియనుంది. ఈక్రమంలో బుధవారం మహా శివరాత్రి పర్వదినం త -మిగతా 2 లో



## దోషులుగా తేలిన నేతలపై జీవిత కాలం నిషేధం

- సుప్రీంలో కేసుపై స్పందించిన కేంద్రం
- అది ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదన్న కేంద్రం
- కేవలం ఆరేళ్ల నిషేధం సరిపోతందని నివేదిక

న్యూఢిల్లీ,

వివిధ కేసుల్లో దోషులుగా తేలిన నేతలపై జీవిత కాల నిషేధాన్ని విధించాలన్న అభ్యర్థను కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకించింది. ఈ కేసులో సదరు వ్యక్తిపై ఆరేళ్ల పాటు నిషేధం విధిస్తే సరిపోతుందని తెలిపింది. ఓ వ్యక్తిపై జీవిత కాల నిషేధం అనేది కఠినతరమని పేర్కొంది. అయితే రాజకీయ నేతలపై జీవిత కాల నిషేధం ఎన్నేళ్లు అనే దానిపై నిర్ణయాధికారం పార్లమెంట్‌దేనని ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ఖరాకండిగా తేల్చి చెప్పింది. దోషులుగా రుజువు అయితే -మిగతా 2 లో





## నేడు తెలంగాణ ఎమ్మెల్సీ ఎన్నికలు

- ఏడు ఉమ్మడి జిల్లాల్లో పోలింగ్ ఏర్పాట్లు

హైదరాబాద్,

తెలంగాణలో 27న జరుగనున్న గ్రాడ్యుయేట్, టీచర్ కోటా ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. గురువారం ఈ ఎన్నికలు జరుగతనున్నాయి. 7 ఉమ్మడి జిల్లాల్లో ఈ ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్నాయి. పోలింగ్ కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది ఎన్నికల సంఘం. ఈ క్రమంలో పోలింగ్ ఏర్పాట్లను పరిశీలించారు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, -మిగతా 2 లో




## ఇందిరమ్మ ఆత్మీయ భరోసా నిధులు విడుదల

- మొత్తం 18,180 మందికి రూ. 6వేల చొప్పున జమ

హైదరాబాద్,

తెలంగాణలో ఉపాధి కూలీలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఉపాధి కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా నిధులను విడుదల చేసింది ప్రభుత్వం. ఎన్నికల కోడ్ అమల్లో లేని ఉమ్మడి రంగారెడ్డి, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాల్లో ఉపాధి కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ -మిగతా 2 లో

## దేశవ్యాప్తంగా మహా శివరాత్రి పర్వదినం



- జ్యోతిర్లింగ క్షేత్రాలకు పోటెత్తిన భక్తులు
- ఉజ్జయినిలో సీఎం మోహన్ యాదవ్ దంపతుల పూజలు
- గోరఖ్‌పూర్‌లో యోగి ఆదిత్యానాథ్ ప్రత్యేక పూజలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)

దేశవ్యాప్తంగా మహా శివరాత్రి పర్వదినాన్ని ప్రజలు మహా వేడుకగా జరుపుకున్నారు. దేశంలోని అన్ని శైవాలయాలు, జ్యోతిర్లింగాలు.. శివ భక్తులతో నిండిపోయాయి. తెల్లవారుజాము నుంచే ప్రధాన ఆలయాల్లో అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. -మిగతా 2 లో



## ఫార్మసీ రంగంలో అంతర్జాతీయ స్థాయికి హైదరాబాద్

- లైఫ్‌సైన్సెస్, ఫార్మాసూటికల్స్, హెల్త్‌కేర్ రంగాల్లో ముందంజ
- డ్రగ్స్, ఫార్మాసూటికల్స్ ఉత్పత్తిలో మూడో స్థానంలో భారత్
- బయో ఏషియా సదస్సు ముగింపు కార్యక్రమంలో కీషన్ రెడ్డి

హైదరాబాద్,

హైదరాబాద్ ముత్యాల నగరంగానే కాకుండా, ప్రపంచ ఫార్మసీగా, అంతర్జాతీయ స్థాయి ఆస్పత్రులు హబ్‌గా ఖ్యాతికెక్కిందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు.22వ ఎడిషన్ బయో ఆసియా-2025 లాంటి గ్లోబల్ ఈవెంట్స్ నగర వేదికగా జరగడం, హెల్త్‌కేర్ రంగంలోని సాంకేతికత, సుస్థిరమైన పద్ధతుల గురించి చర్చించడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. బుధవారం బయో ఏషియా-2025 సదస్సు ముగింపు కార్యక్రమంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పాల్గొన్నారు. -మిగతా 2 లో

# దక్షిణాది రాష్ట్రాలకు తీరని అన్యాయం



**దేశ నిర్మాణంలో దక్షిణాది రాష్ట్రాలదే ప్రధాన పాత్ర**

- జీడీపిలో 5.2 శాతం కంటే ఎక్కువ వాటా ఇక్కడి నుంచే..
- తమిళనాడు సీఎం స్టాలిన్ కు మద్దతు
- డీలిమిటేషన్ పేరుతో నియోజవర్గాల కుదింపు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్, ఫిబ్రవరి 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)

నియోజకవర్గాల పునర్విభజన విషయంలో దక్షిణాది రాష్ట్రాలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. జనాభా ప్రాతిపాదికన నియోజకవర్గాలను పునర్విభజించాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయం తెలంగాణతో సహా ఇతర దక్షిణాది రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, కేరళలకు -మిగతా 2 లో

# మెట్రో విస్తరణకు నిధులివ్వండి

(మొదటి తరువాయి)

నగరంలో మెట్రో విస్తరణపై దృష్టి సారించలేదని ప్రధానమంత్రి దృష్టికి సీఎం తీసుకెళ్లారు. హైదరాబాద్ నగరంలో ఫేజ్-2 కింద రూ.24,269 కోట్ల అంచనా వ్యయంతో 76.4 కి.మీ పొడవైన అయిదు కారిడార్లను ప్రతిపాదించామని ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివరించారు. ఈ ప్రాజెక్టుకు వెంటనే అనుమతిం చాలని అభ్యర్థించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో ఆయన అధికారిక నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం ఉదయం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలను ముఖ్యమంత్రి ప్రధానమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. రీజినల్ రింగు రోడ్డు (ఆర్ఆర్ఆర్) ఉత్తర భాగంలో ఇప్పటికే 90 శాతం భూ సేకరణ పూర్తయినందున ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగాన్ని వెంటనే మంజూరు చేయాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. ఉత్తర భాగంతో పాటే దక్షిణ భాగం పూర్తయితే ఆర్ఆర్ఆర్‌ను పూర్తిగా సద్వినియోగం చేసుకోగలమన్నారు. దక్షిణ భాగం భూ సేకరణకు అయ్యే వ్యయంలో 50 శాతం భరించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని ముఖ్యమంత్రి ప్రధానమంత్రికి తెలియజేశారు. ఆర్ఆర్ఆర్‌కు సమాంతరంగా రీజినల్ రింగ్ రైలు ప్రాజెక్టు ప్రతిపాదన ఉందని పీఎం మోదీకి సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. ఈ రీజినల్ రింగ్ రైలు పూర్తయితే తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల్లోని రైలు మార్గాలతో అనుసంధానత సులభమవుతుందని ప్రధానమంత్రి మోదీకి సీఎం రేవంత్ రెడ్డి తెలియజేశారు.. రీజినల్ రింగ్ రైలుకు అనుమతి ఇవ్వాలని పీఎంను సీఎం కోరారు. సముద్ర మార్గం లేని తెలంగాణకు వస్తువుల ఎగుమతులు, దిగుమతులు సులువుగా చేసేందుకు రీజినల్ రింగు రోడ్డు సమీపంలో డ్రైపోర్ట్ అవసరమని, ఆ డ్రైపోర్ట్ నుంచి ఏపీలోని సముద్ర పోర్ట్ లను కలిపేందుకు గ్రీన్ ఫీల్డ్ రోడ్డు తో పాటు రోడ్డును ఆనుకొని రైలు మార్గం మంజూరు చేయాలని ప్రధానమంత్రి మోదీని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. తెలంగాణ సంస్కృతి, ఆధ్యాత్మికత మూసీ నదితో ముడిపడి ఉందని... రాజధాని హైదరాబాద్ నగరం మధ్యగా మూసీ ప్రవహిస్తోందని.. అంత ప్రాధాన్యం ఉన్న మూసీ పునరుజ్జీవనానికి సహకరించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈసా, మూసా నదుల సంగమంలో ఉన్న బాపూ ఘాట్ అభివృద్ధి, మూసీ ప్రక్షాళనకు 27 ఎస్టీపీల నిర్మాణం, మూసీ రిటైనింగ్ వాల్స్, కరకట్టల నిర్మాణం, మూసీ గోదావరి నదుల అనసంధానంతో కలిపి మొత్తంగా ప్రాజెక్టుకు రూ.20 వేల కోట్లు ఆర్థిక సహాయం అందజేయాలని ప్రధానమంత్రిని ముఖ్యమంత్రి కోరారు. గాంధీ సరోవర్ ప్రాజెక్ట్ కు 222.7 ఎకరాల రక్షణ భూముల బదిలీకి సహకరించాలని పీఎంకు ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణకు 61 ఐపీఎస్ కేడర్ పోస్టులు వచ్చాయని, 2015లో రివ్యూ తర్వాత మరో 15 పోస్టులు అదనంగా వచ్చాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. సైబర్ నేరాలు, డ్రగ్స్ కేసులు పెరగడం, రాష్ట్రంలో పెరిగిన పట్టణాలు, ఇతర అవసరాల దృష్ట్యా తెలంగాణకు అదనంగా 29 ఐపీఎస్ పోస్టులు మంజూరు చేయాలని పీఎం మోదీని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు.సెమీ కండక్టర్ల పరిశ్రమ ఏర్పాటుకు అనువైన పరిస్థితులు తెలంగాణలో ఉన్నందున ఇండియా సెమీ కండక్టర్ మిషన్ ప్రాజెక్టును రాష్ట్రంలో ఏర్పాటు చేసేందుకు అనమతించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. ముఖ్యమంత్రి వెంట రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఉన్నారు.

# కుంభమేళాలో హరహరమహదేవ్

(మొదటి తరువాయి)

సందర్భంగా భక్తులు తరలివచ్చారు. 'హర హర మహాదేవ్' నామస్మరణలతో త్రివేణీ సంగమం ఘాట్లు మార్మోగాయి. ఇప్పటివరకు 64 కోట్ల మంది భక్తులు వచ్చినట్లు రాష్ట్రప్రభుత్వం పేర్కొంది. ఈ కుంభమేళాలో నేడు చివరి అమృత్ స్నానం కావడంతో భక్తులు పెద్దసంఖ్యలో హాజరవుతున్నట్లు అధికారులు తెలిపారు. దీంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా తగిన ఏర్పాట్లుచేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. అధికారులు భక్తులకు ప్రత్యేక సూచనలు జారీ చేశారు. భద్రతా నియమాలు పాటించి తమతో సహకరించాలని కోరారు. ఇక, ఈ ఏర్పాట్లను గోరఖ్‌నాథ్ కంట్రోల్ రూమ్ నుంచి రాష్ట్ర ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ పర్యవేక్షించారు. ఇదిలాఉండగా.. కొన్నిరోజుల క్రితం మౌని అమావాస్య, వసంత పంచమి వంటి ముఖ్యమైన రోజుల్లో భక్తులు పెద్దఎత్తున పోటెత్తడంతో ప్రయాగ్‌రాజ్ మార్గంలోని జాతీయరహదారిపై సుమారు 350 కి.మీ. పొడవునా వాహనాలు నిలిచిపోయిన సంగతి తెలిసిందే. ఈసారి భక్తులు ట్రాఫిక్‌లో చిక్కుకుపోకుండా ఉండేందుకు కుంభమేళా ప్రాంతాన్ని నో వెహికల్ జోన్ గా అధికారులు ప్రకటించారు. మంగళవారం సాయంత్రం 4 గంటల నుంచి దీన్ని అమలుచేశారు. స్థానికుల కోసం నిత్యావసర సరకులు తీసుకొచ్చే వాహనాలను మాత్రమే అనుమతించారు. కుంభమేళా ముగిశాక భక్తులు క్షేమంగా తిరుగు పయనం అయ్యేలా ప్రయాగ్‌రాజ్ నుంచి దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాలకు బుధవారం 350 రైళ్లను రైల్వేశాఖ నడుపుతోంది. జనవరి 13న ప్రారంభమైన ఈ కుంభమేళా దాదాపు 45 రోజులుగా కొనసాగుతోంది. ఇప్పటికే రికార్డ్ స్థాయిలో 63.36 కోట్ల మందికిపైగా భక్తులు పుణ్యస్నానాలు ఆచరించినట్లు యూపీ ప్రభుత్వం ప్రకటించింది. ప్రపంచంలోనే అతిపెద్ద ఉత్సవంగా కుంభమేళా నిలిచింది. ప్రయాగ్‌రాజ్‌లోని త్రివేణి సంగమం దగ్గర కోట్లాది మంది భక్తులంతా పుణ్యస్నానాలు ఆచరించారు. ఇదిలా ఉంటే ఈ కుంభమేళాకు యూపీ ప్రభుత్వం ప్రగడ్బందీగా ఏర్పాట్లు చేసింది. తాత్కాలిక గుడారాలు, టాయిలెట్లు ఏర్పాటు చేసింది. అలాగే ఎప్పటికప్పుడు శుభ్రం చేసేలా పారిశుద్ధ్య కార్మికులను ఏర్పాటు చేసింది. ఇక తప్పిపోయిన వారి సమాచారం తెలియజేసేందుకు 24 గంటలు సేవా కేంద్రాలను ఏర్పాటు చేశారు. అంతేకాకుండా వైద్య సౌకర్యాలు కూడా ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. ఇక ప్రతి 12 సంవత్సరాలకు ఒకసారి ఈ కుంభమేళా జరుగుతుంది. అయితే ఈసారి ఊహించని రీతిలో భక్తులు రావడంతో భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. పెట్రోల్, ఆహార కొరత ఏర్పడింది. ఇక జనవరి 26న మౌని అమావాస్య సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో 30 మందికి పైగా మరణించగా, 60 మందికి పైగా గాయపడ్డారు. ఇక న్యూఢిల్లీ రైల్వేస్టేషన్‌లో జరిగిన తొక్కిసలాటలో కూడా మరో 18 మంది ప్రాణాలు కోల్పోయారు. దీంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలు అంటూ ప్రతిపక్షాలు విమర్శలు గుప్పించాయి. ఇక ప్రతిపక్షాల విమర్శలను యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ తిప్పికొట్టారు.

# దక్షిణాది రాష్ట్రాలకు 6తీరని అన్యాయం

(మొదటి తరువాయి)

శాపంగా పరిణమిస్తుందని ఆయన హెచ్చరించారు. ఈ విషయంలో తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ సామాజిక మాధ్యమాల్లో వ్యక్తం చేసిన ఆందోళనలతో తాను పూర్తిగా ఏకీభవిస్తున్నానని కేటీఆర్ తెలిపారు. దేశ సంక్షేమం కోసం జనాభా నియంత్రణను ఒక యజ్ఞంలా భావించి, దాన్ని విజయవంతంగా అమలు చేసిన దక్షిణాది రాష్ట్రాలను కేంద్రంలోని మోడీ ప్రభుత్వం శిక్షించాలని చూస్తోందా అని కేటీఆర్ ప్రశ్నించారు. 'జనాభా నియంత్రణలో దక్షిణాది రాష్ట్రాలు చేసిన కృషిని పట్టించుకోకుండా, కేవలం జనాభా ఆధారంగా నియోజకవర్గాలను పునర్విభజించడం ప్రజాస్వామ్యానికి, సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధం' అని ఆయన మండిపడ్డారు. దక్షిణాది రాష్ట్రాలు దేశ నిర్మాణంలో అందించిన సహకారాన్ని ఎవరూ కాదనలేరని ఆయన అన్నారు. '1951లో దక్షిణాది రాష్ట్రాల జనాభా వాటా 26.2 శాతం ఉండగా, 2022 నాటికి అది 19.8 శాతానికి పడిపోయింది. అదే సమయంలో ఉత్తరప్రదేశ్, బిహార్, మధ్యప్రదేశ్, రాజస్థాన్ వంటి ఉత్తర రాష్ట్రాల జనాభా వాటా 39.1 శాతం నుంచి 43.2 శాతానికి పెరిగింది. ఈ పరిస్థితుల్లో జనాభా ఆధారంగా లోక్‌సభ సీట్లను నిర్ణయిస్తే, ఉత్తరప్రదేశ్ మరియు బిహార్‌లకు కలిపి 222 సీట్లు వస్తాయి, అయితే ఐదు దక్షిణాది రాష్ట్రాలకు కలిపి కేవలం 165 సీట్లు మాత్రమే లభిస్తాయి' అని కేటీఆర్ వివరించారు. 'దక్షిణాది రాష్ట్రాలు ఆర్థిక వృద్ధి, మానవ అభివృద్ధి సూచికలు, జనాభా నియంత్రణ వంటి అన్ని రంగాల్లో ఉత్తర రాష్ట్రాల కంటే గణనీయంగా మెరుగైన పనితీరు కనబరిచాయి. అలాంటి రాష్ట్రాలను శిక్షించి, వెనుకబడిన రాష్ట్రాలను ప్రోత్సహించడం దేశ ప్రయోజనాలకు వ్యతిరేకం' అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. జనాభా కంటే ఆర్థిక సహకారాన్ని ప్రాతిపాదికగా తీసుకోవాలని కేటీఆర్ ప్రతిపాదించారు. 'తెలంగాణ జనాభా దేశ జనాభాలో కేవలం 2.8 శాతం మాత్రమే ఉన్నప్పటికీ, దేశ జీడీపీలో 5.2 శాతం కంటే ఎక్కువ సహకారం అందిస్తోంది. ఇదే విధంగా దక్షిణాది రాష్ట్రాలు దేశ ఆర్థిక వ్యవస్థకు అపారమైన సహకారం అందిస్తున్నాయి. కాబట్టి నియోజకవర్గాల పునర్విభజనలో ఈ అంశాన్ని పరిగణనలోకి తీసుకోవాలి' అని కేటీఆర్ సూచించారు.

# ఫార్మసీరంగంలో అంతర్జాతీయ స్థాయికి హైదరాబాద్

(మొదటి తరువాయి)

ఈ సందర్భంగా వివిధ రంగాల్లో వినూత్నమైన ఆవిష్కర్తలకు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి బహుమతులు అందజేశారు. లైఫ్‌సైన్సెస్, ఫార్మాసూటికల్స్, హెల్త్‌కేర్ రంగాల్లో భారతదేశం విశేషమైన పురోగతి సాధిస్తోందని చెప్పారు. డ్రగ్స్, ఫార్మాసూటికల్స్ ఉత్పత్తిలో భారత్ ప్రపంచంలో మూడో స్థానంలో ఉందని గుర్తుచేశారు. ప్రపంచవ్యాప్తంగా ప్రజలకు మందులు అందుబాటులో ఉండాలన్న సంకల్పంతో ప్రపంచ అవసరాల్లో 60 శాతానికి పైగా వ్యాక్సిన్లు, 20 శాతం జెనరిక్ మందులను భారత్ నుంచే సరఫరా చేస్తున్నామని చెప్పారు. పదేళ్లలో భారత ఫార్మా ఉత్పత్తుల ఎగుమతుల విలువ దాదాపు రెట్టింపు అయిందన్నారు. 2014లో 15 బిలియన్ డాలర్ల విలువైన ఫార్మా ఉత్పత్తులు ఎగుమతి కాగా, 2024లో ఇది 27.85 బిలియన్ డాలర్లకు పెరిగిందని అన్నారు. భారత్‌లో ఫార్మా ఉత్పత్తులతోపాటు వివిధ రంగాల్లోనూ ఎగుమతులు పెరిగాయని చెప్పారు. ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రంగంపై కేంద్ర ప్రభుత్వం పెద్దమొత్తంలో పెట్టుబబడులు పెడుతున్న కారణంగానే.. ఈ మార్పులు సాధ్యమవుతున్నాయని తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలో దేశంలో వస్తున్న ఆర్థిక సంస్కరణల కారణంగా.. భారతదేశం ఇటీవలే 5వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించిందని తెలిపారు. సమీప భవిష్యత్తులోనే మూడో స్థానానికి ఎగబాకుందనే విశ్వాసం తమకుందని అన్నారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ దూరదృష్టి ఫలితంగా.. రక్షణ రంగంలో దిగుమతులు చేసుకునే పరిస్థితి నుంచి టాప్ -25 ఎగుమతుల దేశాల జాబితాలో చేరాం. 2014లో ఒక్క మొబైల్‌ఫోన్ కూడా ఎగుమతి చేయలేని పరిస్థితి నుంచి.. ఇప్పుడు రూ.1.28 లక్షల కోట్ల విలువైన మొబైల్‌ఫోన్లను ఎగుమతి చేసే స్థాయికి చేరుకున్నాం. రానున్న రెండేళ్లలో భారత్ 5 ట్రిలియన్ డాలర్ల ఎకానమీకి చేరుకోవాలన్న లక్ష్యాన్ని నిర్దేశించుకున్నాం. 2030 నాటికి ఏకంగా 7 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతాం. 2047కల్లా భారత్ 18 వేల డాలర్ల తలసరి ఆదాయంతో 30 ట్రిలియన్ ఎకానమీగా ఎదగాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నాం. ప్రధానమంత్రి నరేంద్రమోదీ విజన్, వేగంగా సమర్థవంతంగా పథకాల అమలు, యువశక్తి సామర్థ్యం, వివిధ రంగాల్లో నిపుణులు, పారిశ్రామికవేత్తలందరి కృషికారణంగానే ప్రగతి సాధిస్తున్నాం. 2014కు ముందు 'ఫియర్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' నుంచి 2014 తర్వాత 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' దిశగా దేశం పరివర్తనం చెందింది. ఇదంతా కేంద్ర ప్రభుత్వం అనేక రంగాల్లో తీసుకొచ్చిన విప్లవాత్మక సంస్కరణల కారణంగానే సాధ్యమైంది.

# దోషులుగా తేలిన నేతలపై జీవిత కాలం నిషేధం

(మొదటి తరువాయి)

జీవితకాల నిషేధాన్ని విధించాలంటూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఈ నేపథ్యంలో ఈ అంశంపై కేంద్రం తన అభిప్రాయాన్ని వివరిస్తూ.. సుప్రీంకోర్టులో బుధవారం అఫిడవిట్ దాఖలు చేసింది. దోషులుగా తేలిన నేతలపై జీవిత కాలం నిషేధం విధించాలంటూ న్యాయవాది అశ్వినీ కుమార్ ఉపాధ్యాయ్ సుప్రీంకోర్టులో గతంలో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను సుప్రీంకోర్టు విచారించింది. ఈ నేపథ్యంలో దీనిపై స్పందన తెలియజేయాలంటూ కేంద్ర ప్రభుత్వంతో పాటు కేంద్ర ఎన్నికల సంఘాన్ని సుప్రీంకోర్టు కోరింది. ఆ క్రమంలో సుప్రీంకోర్టులో కేంద్ర ప్రభుత్వం తాజాగా తన అభిప్రాయాన్ని వివరిస్తూ అఫిడవిట్ దాఖలు చేసింది.

## నేడు తెలంగాణ ఎమ్మెల్సీ ఎన్నికలు

(మొదటి తరువాయి)

కలెక్టర్ ఇలా త్రిపాఠి. అనంతరం మీడియాతో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు ఇలా త్రిపాఠి. ఎన్నికల ఏర్పాట్లలో భాగంగా పాత 3 జిల్లాలు, కొత్తగా ఏర్పడ్డ 12 జిల్లాల అధికారుల కోఆర్డినేషన్ బాగుందని.. ఇప్పటివరకు వచ్చిన ఫిర్యాదులపై విచారణ చేస్తామని అన్నారు. సుమారు రెండు వేల మంది సిబ్బందితో ఎన్నికలు నిర్వహణ జరుగుతుందని అన్నారు త్రిపాఠి.ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గంలో 25,797 మంది ఓటర్లు ఉండగా.. 200 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని అన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద వెబ్ క్యామ్, సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని.. ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేస్తామని అన్నారు. దాదాపు 1100 మందిని ఎన్నికల నిర్వహణ కోసం కేవలం పోలింగ్ కేంద్రాల్లోనే ఏర్పాటు చేశామని అన్నారు.విద్యావంతులైన ఉపాధ్యాయులు ఎలాంటి ప్రలోభాలకు గురి కాకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలని అన్నారు త్రిపాఠి. ఇలా త్రిపాఠితో పాటు పోలింగ్ ఏర్పాట్లను పరిశీలించిన నల్గొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ మాట్లాడుతూ.. దాదాపు వేయి మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశామని అన్నారు. డిస్టిబ్యూషన్ సెంటర్ నుంచి పోలింగ్ కేంద్రాలకు బస్సుల్లో వెళ్లేటప్పటి నుంచి తిరిగి రిసెప్షన్ సెంటర్‌కు వచ్చే వరకు పోలీసుల భద్రత ఉంటుందని అన్నారు.వాహనం వెంట సెక్యూరిటీ కూడా నల్లగొండ జిల్లా పోలీసులే ఉంటారని.. బయటి జిల్లాల నుంచి బ్యాలెట్ పేపర్లను తరలించేటప్పుడు జిపిఎస్ సిస్టం పరిశీలిస్తూ సెక్యూరిటీ ద్వారా తీసుకొస్తామని తెలిపారు. పోలింగ్ అనంతరం ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్లగొండ జిల్లాలకు సంబంధించిన అన్ని బ్యాలెట్ బాక్సులను నల్లగొండలోని రిసెప్షన్ సెంటర్‌కు తీసుకొస్తామని.. ఆ తర్వాత అక్కడే ఏర్పాటు చేసిన స్టాం÷-రగ్ రూమ్‌ల్లో పొలిటికల్ ప్రజాప్రతినిధుల సమక్షంలో భద్రపరుస్తామని అన్నారు. స్టాం÷-రగ్ రూమ్‌ల వద్ద మూడంచెల భద్రత ఉంటుందని అన్నారు ఎస్పీ శరత్ చంద్ర పవార్.

## ఇందిరమ్మ ఆత్మీయ భరోసా నిధులు విడుదల

(మొదటి తరువాయి)

భరోసా కింద నిధులు జమ అయ్యాయి. జనవరి 26న ఇందిరమ్మ ఆత్మీయ భరోసాను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన విషయం తెలిసిందే. ప్రతి మండలంలోని ఒక పైలెట్ గ్రామంలో గ్రామ సభలు నిర్వహించి కూలీల ఖాతాల్లో ప్రభుత్వం నిధులను జమ చేసింది. మొత్తం 18,180 మందికి 6 వేల చొప్పున జమ అయ్యాయి. అయితే ఆ తర్వాత మండలి ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో ఇంది రమ్మ ఆత్మీయ భరోసా నిలిచిపోయింది. కానీ.. ఎన్నికల కోడ్ అమలులో లేని జిల్లాలకు నిధులు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని మంత్రి సీతక్క విజ్ఞప్తి చేశారు. మంత్రి వినతిపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. ఈ క్రమంలో ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా నిధులు విడుదల చేస్తూ నిర్ణయం తీసుకుంది. ఆ రెండు జిల్లాల్లో 66,240 మంది ఉపాధి కూలీ లబ్ధిదారులకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా నిధులను చెల్లించింది సర్కార్. 66,640 మంది కూలీల ఖాతాల్లో రూ.39.74 కోట్లు జమ అయ్యాయి. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకంలో భాగంగా ఇప్పటివరకు మొత్తం 83,420 మంది ఉపాధి కూలీలకు రూ.50.65 కోట్లను తెలంగాణ ప్రభుత్వం చెల్లించింది. ఎన్నికల కోడ్ ముగియగానే లబ్ధిదారులందరికీ ఇందిరమ్మ ఆత్మీయ భరోసా నిధులను చెల్లించనుంది సర్కార్. ఇందిరమ్మ ఆత్మీయ భరోసాతో రెక్కల కష్టాన్ని నమ్ముకున్న ఉపాధి కూలీలకు పెద్దదిక్కుగా తెలంగాణ ప్రభుత్వం నిలుస్తోంది. దేశంలో మరే రాష్ట్రంలో లేని విధంగా ఉపాధి కూలీలకు ఆర్థిక చేయుత కల్పిస్తూ ఇందిరమ్మ ఆత్మీయ భరోసాను తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఒక సీజన్‌కు 6000 రూపాయలు చొప్పున కూలీలకు భరోసా కల్పిస్తోంది. డీబీటీ పద్ధతిలో ఉపాధి కూలీల ఖాతాల్లోకి నేరుగా ఇందిరమ్మ ఆత్మీయ భరోసా నిధులను ప్రభుత్వం జమ చేస్తోంది.

## దేశవ్యాప్తంగా మహా శివరాత్రి పర్వదినం

(మొదటి తరువాయి)

వారణాసి, ఉజ్జయిని, సోమ్‌నాథ్ వంటి ప్రధాన శైవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోరక్‌పూర్‌లో సిఎం యోగి ఆదిత్యనాథ్ ప్రత్యేక పూజలు చేశారు. మధ్యప్రదేశ్ సీఎం మోహన్ యాదవ్ దంపతులు ఉజ్జయినిలోని మహాకాలేశ్వర్ ఆలయంలో ప్రత్యేక పూజులు, అభిషేకాలు చేశారు. ఆ ఆలయంలో ఇవాళ తెల్లవారుజామున భస్మహారతి నిర్వహించారు. ఆ తర్వాత మహాకాలుడిని సర్వాంగ సుందరంగా అలంకరించారు. వారణాసిలోని కాశీ విశ్వనాథుడికి ఇవాళ ఉదయం ప్రత్యేక హారతి ఇచ్చారు. కాశీలో వేల సంఖ్యలో భక్తులు విశ్వనాథుడి దర్శనం కోసం ఎదురుచూస్తున్నారు. సుమారు అయిదు కిలోమీటర్ల మేర అక్కడ భక్తులు క్యూ కట్టనట్లు తెలుస్తోంది. ప్రయాగ్‌రాజ్‌లోని త్రివేణి సంగమం వద్ద భక్తులు పవిత్ర స్నానాలు చేశారు. ఢిల్లీలోని గౌరీశంకర్ ఆలయానికి భక్తుల తాకిడి పెరిగింది. హరిద్వార్‌లోని ధాకేశ్వర్ మహాదేవ్ ఆలయం వద్ద భక్తులు భారీ క్యూలైన్ కట్టారు. మహారాష్ట్రలోని త్రయంబకేశ్వర్ ఆలయాన్ని విద్యుత్తు దీపాలతో అలంకరించారు. శివరాత్రి సందర్భంగా భక్తులు భారీ సంఖ్యలో త్రినేత్రుడి దర్శనం చేసుకుంటున్నారు. మహాశివరాత్రి సందర్భంగా భక్తులు లక్షల సంఖ్యలో హాజరయ్యారు. జార్ఖండ్‌లోని దేవ్‌ఘర్‌లో ఉన్న జ్యోతిర్లింగ క్షేత్రమైన బాబా బైద్యనాథ్ ఆలయంలో కూడా భక్తులు కిటకిటలాడిపోయారు. మహాశివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. కేరళలోని కొచ్చిలో ఉన్న అలువ మహాదేవ్ ఆలయానికి కూడా భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

# తెలుగు పంచాంగం 27/2025,గురువారం



సమయ సమాచారం:
సూర్యోదయం: ఉదయం 6:39
సూర్యాస్తమయం: సాయంత్రం 6:18
తిథి:
కృష్ణ పక్ష చతుర్దశి
ప్రారంభం: ఫిబ్రవరి 26 ఉదయం 11:08
ముగింపు: ఫిబ్రవరి 27 ఉదయం 8:54
కృష్ణ పక్ష అమావాస్య
ప్రారంభం: ఫిబ్రవరి 27 ఉదయం 8:54
ముగింపు: ఫిబ్రవరి 28 ఉదయం 6:14
నక్షత్రం:
ధనిష్ఠ
ప్రారంభం: ఫిబ్రవరి 26 సాయంత్రం 5:23
ముగింపు: ఫిబ్రవరి 27 మధ్యాహ్నం 3:43
శతభిషం
ప్రారంభం: ఫిబ్రవరి 27 మధ్యాహ్నం 3:43
ముగింపు: ఫిబ్రవరి 28 మధ్యాహ్నం 1:40
శుభ సమయాలు:
అభిజిత్ ముహూర్తం: మధ్యాహ్నం 12:05 నుండి 12:52 వరకు
అమృతకాలం: ఉదయం 6:03 నుండి 7:32 వరకు
అశుభ సమయాలు:
రాహుకాలం: మధ్యాహ్నం 1:56 నుండి 3:23 వరకు
యమగండం: ఉదయం 6:39 నుండి 8:06 వరకు
దుర్ముహూర్తం: ఉదయం 10:32 నుండి 11:18 వరకు, మధ్యాహ్నం 3:11 నుండి 3:58 వరకు
వర్జ్యం: రాత్రి 10:18 నుండి 11:46 వరక

# గుండాల గుండంలో విద్యార్థి గల్లంతు
## సహాయక చర్యలు ముమ్మరం





**వెల్దండ, ఫిబ్రవరి 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా భక్తులతో కిటకిటలాడిన గుండాల గ్రామంలో విషాదం చోటుచేసుకుంది. శ్రీ అంబా రామలింగేశ్వర స్వామి దర్శనానికి వచ్చిన విద్యార్థి గుండాల గుండంలో స్నానం చేస్తూ గల్లంతయ్యాడు. వనపర్తి జిల్లా గోపాల్‌పేట్ మండలం మున్నూరు గ్రామానికి చెందిన ఉమేష్ కుమార్ అనే ఇంటర్మీడియట్ విద్యార్థి, హైదరాబాద్ జయప్రకాశ్ నగర్‌లోని గురుకుల పాఠశాలలో చదువుకుంటున్నాడు. మహాశివరాత్రి రోజున స్నానం చేయాలని భావించిన అతడు, పాఠశాల నుంచి గోడ దూకి గుండాల గ్రామానికి చేరుకొని, గుండంలో స్నానం చేస్తూ నీటి ప్రవాహానికి చిక్కుకుని గల్లంతయ్యాడు. విద్యార్థి గల్లంతైన విషయం తెలియగానే ఫైర్ సిబ్బంది, వెల్దండ పోలీసులు, స్థానిక ప్రజలు గాలింపు చర్యలు ప్రారంభించారు. వెల్దండ సీఐ విష్ణువర్ధన్ రెడ్డి నేతృత్వంలో గాలింపు కొనసాగుతుండగా, ఇప్పటికీ విద్యార్థి ఆచూకీ లభ్యం కాలేదు. ప్రజల ఆగ్రహం ఈ ఘటన పాఠశాల అధికారుల నిర్లక్ష్యాన్ని చూపుతుందని స్థానికులు ఆరోపించారు. విద్యార్థులు బయటికి వెళ్లకుండా పాఠశాల యాజమాన్యం పర్యవేక్షణ పెంచాల్సిన అవసరం ఉందని, లేకపోతే ఇలాంటి ఘటనలు పునరావృతమయ్యే అవకాశం ఉందని పలువురు భయపడుతున్నారు. విద్యార్థుల భద్రతకు గట్టి చర్యలు తీసుకోవాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించిన గురుకుల సిబ్బందిని విధుల నుంచి తొలగించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఘటన స్థలానికి చేరుకొని సహాయక చర్యలను పర్యవేక్షించారు. విద్యార్థిని సురక్షితంగా బయటకు తీసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ ఘటన గుండాల గ్రామంలో తీవ్ర విషాదాన్ని నింపింది. విద్యార్థి ఆచూకీ కోసం సహాయక బృందాలు గాలింపు ముమ్మరం చేయగా, అతడి ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు కంటతడి పెడుతున్నారు.

# భారీ బందోబస్తు మధ్య శివరాత్రి ఉత్సవాలు

**-వేలాదిగా తరలివచ్చిన భక్తులు**




**షాద్ నగర్, ఫిబ్రవరి 26(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
మహాశివరాత్రి పురస్కరించుకొని భక్తుల రద్దీదృష్ట పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేసి భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు రంగారెడ్డి జిల్లా ఫరుకు నగర్ మండలం రామేశ్వరంలో కొలువు తీరిన శివుడుని దర్శించుకునేందుకు జిల్లాతో పాటు చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన వేలాది మంది భక్తులు రామేశ్వరం సందర్శించుకుని శివునికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు ..ఏటా పెరుగుతుందని చెప్పబడుతున్న శివలింగం ను దర్శించుకుని పూజలు జరపాలని భక్తుల విశ్వాసం. వందలాది సంవత్సరాలు చరిత్ర కలిగిన రామేశ్వరంలో ప్రతి ఏటా భక్తుల సంఖ్య పెరుగుతూనే ఉంది అందుకు అనుగుణంగా అధికారులు ఏర్పాటు నిర్వహిస్తున్నారు బుధవారం మహాశివరాత్రి పురస్కరించుకుని రామేశ్వరం వద్ద షాద్నగర్ ఇన్స్పెక్టర్ విజయ్ కుమార్ ఎస్సై శరత్ కుమార్ ,విజయ్ కుమార్ ,రామచందర్ చౌదరి గూడెం ఎస్సై విజయ్ కుమార్ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ చంద్రశేఖర్ తదితరులు అక్కడే ఉండి భక్తులకు ఎలాంటి అసౌకర్యం ఏర్పడకుండా చర్యలు తీసుకున్నారు. అధికార పార్టీకి చెందిన స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, టిఆర్ఎస్ కు చెందిన ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి లతోపాటు పలు పార్టీలకు చెందిన నేతలు పెద్ద ఎత్తున శివయ్యను దర్శించుకున్నారు


# ఊరగుట్ట శివాలయంలో శోభాయమానంగా శివపార్వతి కళ్యాణం



**కొనపూర్, ఫిబ్రవరి 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
మహాశివరాత్రి సందర్భంగా కొనపూర్ ఊరగుట్ట శివాలయంలో భక్తిభావపూర్వకంగా శివపార్వతి కళ్యాణం నిర్వహించారు. భక్తుల సన్నిధిలో కన్నులపండువగా జరిగిన ఈ వేడుకల్లో ప్రముఖ న్యాయవాది మరియు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకులు యాదిలాల్ దంపతులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. శివపార్వతి కల్యాణ మహోత్సవం అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. వేలాది మంది భక్తులు స్వామివారి దర్శనం చేసుకుని, పూజల్లో పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణం శివనామస్మరణతో మార్మోగిపోయింది. ఈ కార్యక్రమంలో అఖిటి మల్లేష్, శివ, జగన్, జంగయ్య, కిష్టయ్య, శ్రీనాథ్, శేఖర్, కృష్ణయ్య, అంజయ్య, జానయ్య తదితరులు పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. శివరాత్రి సందర్భంగా ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేయడంతో భక్తులు వేడుకలను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

# రామలింగేశ్వర స్వామి వారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి.

**-గుడిపల్లి శ్రీనివాస్ పేపర్ శీనన్న**
**-రామేశ్వరంలో మహాశివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు చేసిన టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర నాయకులు గుడిపల్లి శ్రీనివాస్ (పేపర్ శీనన్న)**
**-శ్రీ రామలింగేశ్వర దేవాలయంలో అభిషేకం**



**షాద్ నగర్, ఫిబ్రవరి 26(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ బుధవారం మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఫరూక్ నగర్ మండలం రామేశ్వరం లోని శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయంలో శివలింగానికి అభిషేకం ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం గుడిపల్లి శ్రీనివాస్ మాట్లాడారు.మహాశివరాత్రి పర్వదినాన శ్రీ రామలింగేశ్వర స్వామి వారి ఆశీస్సులు ప్రజలందరుపై ఉండాలని అలాగే జాతర ఉత్సవాలను ప్రత్యేక అంగరంగ వైభవంగా నిర్వహించుకోవడం సంతోషకరమని సకలజనులు జాతర ఉత్సవాలలో పాల్గొని స్వామివారి కృపను పొందాలని ఆకాంక్షించారు.

# అవగాహనా లేకుండా మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీష్ రావు

**-స్థానిక ,గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఖర్చు పరిమితి ఉండదు**
**-బీజేపీ అధికారంలోకి వస్తుందనేది కలనే**
**-42గ్రామాలు తిరగని వ్యక్తి ఎమ్మెల్యేగా ఎలా గెలిచాడు**
**-హరీష్ రావు వ్యాఖ్యలపై స్పందించిన రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు చిన్నా రెడ్డి**



**వనపర్తి, ఫిబ్రవరి 26(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
స్థానిక,గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఖర్చు పరిమితి ఉండదని.. ఎన్నో పదవులు చేపట్టిన మాజీ మంత్రి హరీష్ రావు అవగాహన లేకుండా మాట్లాడటం విడ్డురంగా ఉందని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు చిన్నా రెడ్డి ఆరోపించారు.బుధవారం చిన్నా రెడ్డి ఆయన నివాస గృహంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ ఎన్నో పదవులు అనుభవించిన మాజీ మంత్రి హరీష్ రావు ఎన్నికల అవగాహన లేకుండా మాట్లాడరని...స్థానిక,గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఖర్చు పరిమితి ఉండదని గుర్తు చేశారు. 8 సార్లు ఎమ్మెల్యేగా పోటీ చేశానని.. ఏనాడూ వనపర్తి అభివృద్ధి విషయంలో అడ్డుకోలేదని..ప్రజా ప్రయోజనాల కోసం మాత్రమే చెప్పడం జరిగిందన్నారు. కొందరు వనపర్తి బీజేపీ జిల్లా నాయకులు కాంగ్రెస్ వర్గ పోరుతో అభివృద్ధి కుంటుపడిందని అంటున్నారని..సీఎం రేవంత్ రెడ్డి చదువుకున్న వనపర్తిని అభివృద్ధి చేసేందుకు తమ వంతు కృషి చేస్తున్నామని అన్నారు. బీజేపీ తెలంగాణలో అధికారంలోకి వస్తుందనే కలలు కలగానే మిగిలిపోతాయని.. కార్యకర్తలు అవగాహన లేకుండా మాట్లాడటం తగదన్నారు. వైఎస్ఆర్ లాంటి మహా నాయకున్ని ఎదురించి ప్రత్యేక తెలంగాణ కోసం 41మంది ఎమ్మెల్యేలతో సంతకాలు పెట్టించడం జరిగిందన్నారు.బి


**- 42 గ్రామాలు కూడా తిరగని వ్యక్తి ఎమ్మెల్యేగా ఎలా గెలిచాడు**

కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం మొదటి నుంచి పని చేసిన నేను,కాంగ్రెస్ కార్యకర్తల సపోర్ట్ లేకుండా.. 42గ్రామాలు కూడా తిరగని వ్యక్తి ఎలా ఎమ్మెల్యేగా గెలిచాడని ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు చిన్నా రెడ్డి ప్రశ్నించారు. వనపర్తి అభివృద్ధి కోసం రూ.వెయ్యి కోట్ల ప్రతిపాదనలు తయారు చేసిన మీరు.. ఓ సీనియర్ నాయకున్ని అడగలేదని.. ఏక పక్షంగా పోతున్నది మీరని చిన్నా రెడ్డి మండిపడ్డారు. గోపాల్ పేట మండలాన్ని ఓ నాయకుడు ఏక పక్షంగా రాజ్యం ఏలుతున్నాడని.. గోపాల్ పేటలో ఏర్పాటు కావాల్సిన మార్కెట్ యార్డ్ ఓ వ్యక్తి స్వలాభం కోసం వేరే చోట ఏర్పాటు చేస్తుంటే తప్పని చెప్పడం జరిగిందని అన్నారు.సత్యశీలారెడ్డి నా సహకారంతో సర్పంచుగా, ఆయన భార్య ఎంపీపి కావడం జరిగిందని..ఒళ్ళు దగ్గర పెట్టుకొని మాట్లాడితే బాగుంటుందని, ఇప్పటికైనా నాయకులు కలిసి పోతే కాంగ్రెస్ పార్టీకి మంచిదని అన్నారు.ఈ సమావేశంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాజేంద్ర ప్రసాద్, మాజి మున్సిపల్ వైస్ ఛైర్మెన్ బి. కృష్ణ, రాష్ట్ర మైనార్టీ సెల్ కార్యదర్శి. ఖమ్మర్ మియా, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు సమద్, కాంగ్రెస్ పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి ఎండి. బాబా, పెద్దమందడి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పెంటన్న యాదవ్, సురేష్ గౌడ్, బి. పరుశురాం తదితరులు పాల్గొన్నారు.

## సంపాదకీయం

# మార్చ్ లో మార్కుల పోటీలకు ఇలా సిద్ధమౌదాం





మార్చ్ నెల మొదటి వారం నుంచి పరీక్షలసందడి ప్రారంభమౌతుంది పరీక్షలు మొదలవడంతో మార్కులు సాధించే లక్ష్యంతో విద్యార్థులు సిద్ధమవుతూ, భయాందోళనకు గురిఅవుతూ ఎక్కువ ఒత్తిడి కి లోనవుతారు కానీ అలా కాకుండా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు వారిలో ఆత్మవిశ్వాసాన్ని నింపాలి, ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాసే విధంగా వారిని తయారు చేయాలి చిన్న చిన్న పొరపాట్లతో విద్యార్థులు మార్కులు సాధించలేక నిరుత్సాహనికి లోనౌఅవుతుంటారు. వాటిని అధిగమించడానికి పరీక్షకు ఎలా ప్రిపేర్ అవ్వాలి చదివిన విషయాలను ఎలా గుర్తు పెట్టుకోవాలి అన్న అంశాలపై దృష్టిపెడితే విద్యార్థులు అనుకున్న లక్ష్యాలను సాధించవచ్చు.

**జ్ఞాపకశక్తిని ఇలా పెంచుకోండి**

వాకింగ్,స్విమ్మింగ్, ప్లేయింగ్, డాన్సింగ్, సైక్లింగ్,రన్నింగ్ వంటి ఎరోబిక్ వ్యాయామాలు చేయడం వల్ల జ్ఞాపకశక్తి పెరుగుతుంది.

పదవినోదం,ఫజిల్స్,చదరంగం వంటి వాటి వల్ల మెదడు చురుకుగా పనిచేస్తుంది. ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు చేసుకోవడం అంటే నిమ్మజాతి,బొప్పాయి,డి,ఈ విటమిన్లు మెదడు చురుకుతనానికి ఉపయోగపడతాయి. సంగీతం వినడం, లేత ఎండలో నడవడం, చిత్రలేఖనం వేయడం, యోగ,ధ్యానం,సరియైననిద్ర ఉంటివి జ్ఞాపక శక్తిని పెంచుతాయి.

**పరీక్ష రాసేటప్పుడు ఈ నియమాలు పాటించాలి**

పరీక్షలు రాసేవారిలో ఎక్కువ ఎక్కువ శాతం విద్యార్థులు ప్రశ్నపత్రం ఇచ్చిన ఐదు నిమిషాల్లోనే జవాబులు రాయడం మొదలు పెట్టేస్తారు. అలా చేయకుండా ప్రశ్నల్ని పూర్తిగా చదవండి. అడిగిన ప్రశ్నకు మార్కులను బట్టి ఎంత మేరకు రాయాలో ముందుగానే నిర్ణయించుకోవాలి. ప్రశ్నపత్రంలో సరైన సమాధానం రాయగలమన్న నమ్మకం ఉన్న ఏ ప్రశ్నకైనా తొలుత సమాధానం రాయాలి.ఆ ప్రశ్న నంబరును ఎడమ వైపు మార్జిన్లో తప్పక వేయాలి. ప్రశ్నల నంబర్లను తప్పుగా వేయడం, మర్చిపోవడం వంటివి చేయొద్దు. అవసరమైతే చివర్లో మరోసారి చెక్ చేసుకోండి. క్వశ్చన్ పేపర్లో ఛాయిస్ ఉన్నప్పుడు ప్రశ్నల ఎంపిక సరిగా ఉండేలా చూసుకోండి. కఠినంగా ఉన్న ప్రశ్నలపై ఆందోళన చెందొద్దు. తొలుత సులభంగా ఉన్న ప్రశ్నలకు సమాధానాలు రాసిన తర్వాత కఠిన ప్రశ్నలకు సమాధానాలు వ్రాయాలి. రెడ్ పెన్నులు నిషేధం. నీలం, నలుపువి మాత్రమే వాడాలి. సమాధాన పత్రాలో ప్రతి పేజీకి ఎడమ వైపు 2 సెంటిమీటర్ల మార్జిన్ను వదలాలి. ప్రశ్నల గురించిఎక్కువ ఆలోచించొద్దు. మార్కుల ఆధారంగా ప్రశ్నలకు జవాబులు రాసేలా జాగ్రత్త పడండి. పెద్దపెద్ద అక్షరాలతో మరీ ఎక్కువ మార్జిన్ వదిలేసి ఎక్కువ పేజీలు నింపితే ప్రయోజనం ఉండదు. పేపర్ చివర కొంత ప్రదేశం మిగిలిందని మరో జవాబు రాయడం, పదాన్ని విడకొట్టి రాయడం చేయొద్దు. సాధ్యమైనంత వరకు జవాబులు వ్యాసంలా రాయకుండా పాయింట్ల రూపంలో రాస్తే ప్రయోజనం. సైడ్ హెడ్డింగ్లను పెన్నుతో అండర్లైన్ చేయండి. మార్జిన్లను పాటించండి. కోడ్, గుడ్డిగుర్తులు రాయొద్దు. పదాలు, వాక్యాలు పూర్తిగా రాయండి. ప్రధానంగా చేతిరాతబాగుంటేనే వ్యాల్యూషన్ చేసే వారికీ మీ పేపర్ పట్ల మంచి ఆకర్షణ ఏర్పడటంతో పాటు మీరు రాసే జవాబుల్ని త్వరగా గుర్తించగలుగుతారు. సూక్ష్మ ప్రశ్నాపతంలో లో కొట్టివేతలులేకుండా ఏకకాల సమాధానంవ్రాయాలి,సమయం10 నిముషాలు ముగిసే ముందే పరీక్ష రాయడం పూర్తి చేసి సమాధానపత్రాముపునఃపరిశీలన చేసుకొనేలా ప్లాన్ చేసుకోండి. మీరు ఎన్నుకున్న భాషలలో వ్యాకరణం ముఖ్యమైంది. అక్షర దోషాలు లేకుండా రాయడంలో జాగ్రత్త పడండి. గ్రాఫ్లు, పటాలు, బొమ్మలు వంటివి పెన్సిల్ నే వాడాలి.

**వ్యాసకర్త**

**జి రామకృష్ణారెడ్డి**
**జీవశాస్త్ర ఉపాధ్యాయులు**
**తపస్వినిఎడ్యుకేషనల్ అకాడమీ.**



## పాఠకులకు గమనిక:




**మీరు ఎదుర్కొంటున్న సమస్యలను వివరణాత్మకంగా మాకు తెలియజేయండి. ప్రభుత్వ అధికారుల మరియు ప్రజల మధ్య వారధిగా నిలిచి, మా ప్రత్యేక విలేకరుల బృందం సంబంధిత అధికారులను సంప్రదించి, పరిష్కారం కోసం కృషి చేస్తుంది.**

**మమ్మల్ని సంప్రదించడానికి:**

**ఇమెయిల్:** neelagiriexpress@gmail.com

**సంప్రదింపు నెంబర్: 9705770909**

**మీ ప్రతిభావంతమైన భాగస్వామ్యంతో సమాజానికి మంచి మార్పు తీసుకురావడం మా లక్ష్యం.**

మీ గొంతుకకు మేమే వేదిక - నీలగిరి ఎక్స్‌ప్రెస్!

## శివ "శంకర".. భక్తవ "శంకర"

**-శివ సన్నిధిలో షాద్ నగర్ ఎమ్మెల్యే "వీర్లపల్లి శంకర్" దంపతుల పూజలు**
**-శివరాత్రి రోజున తెల్లవారుజామున లింగాభిషేకం**
**-సన్మానాలు.. ఆశీర్వచనాలు అందజేసిన వేద పండితులు**



**షాద్ నగర్, ఫిబ్రవరి 26(నీలగిరి ఎక్స్ ప్రెస్):**

షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆరాధ్య దైవమైన ఆ మహా శివున్ని శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఎంతో భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. శివరాత్రి పండుగ రోజు బుధవారం తెల్లవారుజామున ఎమ్మెల్యే శంకర్ ఆయన సతీమణి అనురాధతో కలిసి శ్రీ ఉత్తర రామలింగేశ్వర స్వామి దేవాలయంలో శివలింగానికి అభిషేకం, అర్చన చేశారు. ఈ సందర్భంగా వేద పండితులు ఎమ్మెల్యే శంకర్ దంపతులను మర్యాదపూర్వకంగా ఆహ్వానించి వారికి ఆలయ కార్య కార్యనిర్వహణాధికారి శివకుమార్ ఆధ్వర్యంలో సన్మాన సత్కారాలతో పాటు దంపతులకు ఆశీర్వచనాలు అందజేశారుద

# దేవదేవుడి ఆశీస్సులు అందరిపై ఉండాలి

**-బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి**
**-హనుమకొండ సిద్దేశ్వరాలయం భూకైలాసగిరిలో శివరాత్రి పూజలు**
**-స్థానిక బిజెపి నేతలతో శ్రీవర్ధన్ రెడ్డి కార్యక్రమాలు**
**-షాద్ నగర్ నియోజకవర్గ ప్రజలకు మహాశివరాత్రి శుభాకాంక్షలు**




**షాద్ నగర్, ఫిబ్రవరి 26(నీలగిరి ఎక్స్ ప్రెస్)**

ప్రజలపై ఆ దేవదేవుడి ఆశీస్సులు ఎల్లవేళలా ఉంటాయని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి అన్నారు. హనుమకొండ సిద్దేశ్వరాలయంలో భూకైలాసగిరిలో మహాశివరాత్రి సందర్భంగా స్థానిక బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి కీర్తి రెడ్డి , బీజేపీ రాష్ట్ర నాయకులు సత్యపాల్ రెడ్డి, భూపాలపల్లి జిల్లా అధ్యక్షులు నిషిధర్ రెడ్డితో కలిసి మహాశివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార కార్యక్రమాలలో భాగంగా పార్టీ ప్రచారం నిమిత్తం హనుమకొండలో ఉమ్మడి జిల్లాలో ప్రచారం చేస్తున్నట్లు తెలిపారు. ఆ శివయ్య ఆశీస్సులు ఎప్పటికీ ప్రజల వెంట ఉంటాయని అదేవిధంగా భారతీయ జనతా పార్టీ హిందూ ధర్మం కోసం పనిచేస్తుందని ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిజెపి అభ్యర్థి గెలుపు ఖాయమని ఈ సందర్భంగా శ్రీ వర్ధన్ రెడ్డి ప్రస్తావించారు. ఈ సందర్భంగా షాద్ నగర్ నియోజకవర్గ ప్రజల కు కూడా ఆయన మహాశివరాత్రి పర్వదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా హనుమకొండలో ఉన్నట్లు ఆయన తెలిపారు. ఆ శివయ్య ఆశీస్సులతో అందరూ బాగుండాలని శ్రీ వర్ధన్ రెడ్డి కోరారు..

## కుక్కల స్వైర్య విహారం.. ఏది పురపాలక పరిష్కారం..?

**మాజీ కౌన్సిలర్ కూతురు పైన దాడి..**




**షాద్ నగర్,ఫిబ్రవరి 26(నీలగిరి ఎక్స్ ప్రెస్):**

-రాత్రివేళ భయం పుట్టిస్తున్న గ్రామసింహాలు..

-పురపాలిక ఆపరేషన్ ఏమైనట్లు..?

షాద్ నగర్ పట్టణంలోని లక్ష్మీనరసింహ కాలనీ, మల్లికార్జున కాలనీ, పద్మావతి కాలనీలలో మరియు బైపాస్ శివ హనుమాన్ కాలనీ, (కేశంపేట్ రోడ్) కుక్కలు స్వైర్య విహారం చేస్తున్నాయి. దారిన పోయే వారి మీద దాడి చేస్తూ కరుస్తున్నాయి. ఇటీవల స్థానిక కౌన్సిలర్ రెటికల్ నందీశ్వర్ కూతురు మీద కూడా దాడి చేశాయి. కౌన్సిలర్ కూతురికే రక్షణ లేకపోతే మిగతా వారి పరిస్థితి ఏమిటన్నది ప్రశ్నార్థకం. పురపాలిక ఆధ్వర్యంలో కుక్కలకు ఆపరేషన్ చేయడం ద్వారా సమస్యను పరిష్కరిస్తామని గత కమిషనర్ వెంకన్న హామీ ఇచ్చినప్పటికీ ఇప్పటిదాకా ఎలాంటి పరిష్కారం లేదు. కుక్కల ద్వారా భయాందోళనలు రోజురోజుకీ పెరుగుతున్నాయి. ముఖ్యంగా చిన్నపిల్లలు భయాందోళనకు గురవుతున్నారు. దీనిపై తక్షణమే చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది

# ధ్వజస్తంభ ప్రతిష్టాపన మహోత్సవంలో పాల్గొన్న శ్రీరాములు

**మహేశ్వరం, ఫిబ్రవరి 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

మహేశ్వరం నియోజకవర్గం బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ అల్మాస్గూడలోని వినాయక హిల్స్ కాలనీలో నూతనంగా నిర్మించిన శ్రీ భవాని రామలింగేశ్వర, వరసిద్ధి వినాయక, దాసాంజనేయ, నవగ్రహ సహిత దేవాలయంలో ధ్వజస్తంభ ప్రతిష్టాపన మహోత్సవ కార్యక్రమానికి బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మరియు మహేశ్వరం నియోజకవర్గం ఇంచార్జ్ అందెల శ్రీరాములు హాజరై శ్రీ రేణుక రాజరాజేశ్వరి పీఠం మెల్లూరి నవీన్ శర్మ ఆశీర్వాదాలు పొందారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులందరూ కలిసి శ్రీరాములు ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ అధ్యక్షులు రామిడి వీరకర్ణ రెడ్డి, రాళ్లగూడెం రామకృష్ణారెడ్డి, మాజీ కార్పొరేటర్లు దడిగ శంకర్, గడ్డం లక్ష్మారెడ్డి, మాజీ కార్పొరేషన్



అధ్యక్షులు చెరుకుపల్లి వెంకట్ రెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు శివారెడ్డి, బిజెపి సీనియర్ నాయకులు ఏనుగు రామిరెడ్డి, కాలనీ అధ్యక్షులు కృష్ణ యాదవ్, కార్యదర్శి సతీష్ రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు మహేష్, పాండు యాదవ్, శ్రీనివాస్ రెడ్డి, కొండల్ రెడ్డి, రాజేందర్ రెడ్డి, సంజీవ రెడ్డి, వెంకటేశ్వర గౌడ్, ప్రభాకర్ రెడ్డి, జయేందర్ రెడ్డి, పురుషోత్తం రెడ్డి, బిజెపి, బీజేవైఎం నాయకులు మరియు కాలనీ వాసులు పాల్గొన్నారు.

## మహాశివరాత్రి జాతరకు పోలీస్ బందోబస్తు

**మహబూబాబాద్ జిల్లా బ్యూరో ఫిబ్రవరి 26**

మహాశివరాత్రి సందర్భంగా కురవి భద్రకాళి సామెత శ్రీ విరభద్రస్వామి దర్శించుకొన్న మహబూబాబాద్ జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్. శివరాత్రికి వచ్చే భక్తులకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎలాంటి ఇబ్బందులు జరగకుండా భక్తులు స్వామివారి దర్శనం చేసుకునే విధంగా పోలీస్ సిబ్బంది కృషి చేయాలని వారు అన్నారు. భక్తుల సౌకర్యార్థం పోలీస్ బందోబస్తును పర్యవేక్షించిన జిల్లా ఎస్పీ.

# చెట్టు = అమ్మ, చెత్త = రోగం

చెట్టు మన జీవితానికి అమ్మంత ప్రాముఖ్యమైనది. అది మనకు ప్రాణవాయువును అందిస్తుంది, ప్రకృతిని సంరక్షిస్తుంది, మన శ్రేయస్సుకు తోడ్పడుతుంది. చెట్టు ఉంటే జీవితం ఉందని చెప్పడం అసత్యం కాదు. మరోవైపు, చెత్త అనేది రోగాలకు కారణమవుతుంది. చెత్త ఎక్కడైతే పేరుకుపోతుందో అక్కడ పర్యావరణం కలుషితమవుతుంది, నీరు, గాలి, నేల నాశనం అవుతాయి.

**చెట్టు ఎలా అమ్మలా ఉంటుంది:**

-మనకు ఆక్సిజన్ అందిస్తుంది.

-నీడ, చల్లదనం, ఆహారం, చెక్క, ఔషధాలు అందిస్తుంది.

-ప్రకృతి మనుగడలో కీలక పాత్ర పోషిస్తుంది.

**చెత్త ఎలా రోగంగా మారుతుంది:**

-చెత్త పేరుకుపోతే దోమలు, చీమలు, బ్యాక్టీరియా పుట్టుక.

-కాలుష్యం వల్ల శ్వాసకోశ, నీరు మరియు ఆహారానికి సంబంధించిన రోగాలు.

చెట్టు మన జీవితానికి అమ్మవంటిది. అందుకే మనం చెట్లను నాటాలి, వాటిని కాపాడాలి.

చెత్త మన జీవనానికి రోగం. అందుకే చెత్తను తగ్గించాలి, పునర్వినియోగం చేయాలి, పర్యావరణాన్ని స్వచ్ఛంగా ఉంచాలి.

"ప్రకృతిని ప్రేమిద్దాం, జీవనాన్ని కాపాడుకుందాం!"

మీ నరేష్ దండు సామాజిక కార్యకర్త

# 9, 10 తరగతుల్లోనూ తెలుగు తప్పనిసరి

-సీబీఎస్ఈ,ఐసీఎస్ఈ, ఐబీ, ఇతర బోర్డులూ అమలు చేయాలి

-రాష్ట్ర సర్కారు నిర్ణయం

- వనపర్తి జిల్లా విద్యాధికారి అబ్దుల్ గని

**వనపర్తి, ఫిబ్రవరి 26(నీలగిరి ఎక్స్ ప్రెస్) :** రాష్ట్రంలో సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ, ఐబీ తదితర అన్ని బోర్డుల పరిధిలోని పాఠశాలల్లో 9, 10 తరగతుల్లోనూ తెలుగును తప్పనిసరి సబ్జెక్టుగా అమలు చేయాలని రాష్ట్ర సర్కారు నిర్ణయించిందని బుధవారం వనపర్తి జిల్లా విద్యాధికారి కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపారు . ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశంతో రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రంలో 1-10 తరగతుల వరకు అన్ని బోర్డుల పరిధిలో మాతృభాష తెలుగును విధిగా బోధించాలని రాష్ట్ర ప్రభుత్వం 2018 మార్చి 30న చట్టం చేసింది. అధికారులు అదే సంవత్సరం జూన్‌లో జీవో 15 జారీ చేశారు. సీబీఎస్ఈ లాంటి ఇతర బోర్డుల పరిధిలోని పాఠశాలల్లో ఇప్పటివరకు 1 నుంచి 8వ తరగతి వరకు మాత్రమే తెలుగును బోధిస్తున్నారు. 8 వరకు త్రిభాషా సూత్రం అమల్లో ఉన్నందున ఆంగ్లం, హిందీతోపాటు తెలుగును ఒక సబ్జెక్టుగా బోధిస్తున్నారు. తొమ్మిది, పది తరగతుల్లో మాత్రం రెండు భాషా సబ్జెక్టులే ఉంటాయి. అందులో ఒకటి ఆంగ్లం తప్పనిసరిగా ఉంటుంది. మరొకటి హిందీ లేదా వేరే భాషను చదువుకుంటున్నారు. ఇక నుంచి ద్వితీయ భాషగా తెలుగును తప్పనిసరిగా చదవాల్సి ఉంటుంది. వచ్చే విద్యా సంవత్సరంలో 9వ తరగతిలో, ఆ తర్వాత సంవత్సరంలో పదిలో తెలుగు సబ్జెక్టును విధిగా అమలు చేయాలని ప్రభుత్వం స్పష్టంచేసింది. మాతృభాష తెలుగు కాని వారి కోసం 2018-19లోనే వెన్నెల పేరిట సులభమైన తెలుగు వాచకం పుస్తకాన్ని విద్యాశాఖ రూపొందించింది. ప్రస్తుతం దాన్ని 1-8 తరగతి వరకు సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ తదితర పాఠశాలల్లో చదివే వారు ఉపయోగిస్తున్నారు. 9, 10 తరగతుల విద్యార్థులూ ఉపయోగించేందుకు అధికారులు అనుమతిచ్చారు అని ఆయన ఒక ప్రకటన తెలిపారు.

## సంపాదకీయం

# యదార్ధ భక్తి - ఒక అద్భుతమైన అన్వేషణ




భక్తి, మనుషుల మనస్సులో నిక్షిప్తమైన దైవత్వాన్ని బయటకు తీసే అద్భుతమైన మార్గం. దేవుడు అనేది మనుషులు సృష్టించిన ఒక ఊహాజనిత శక్తిరూపం మాత్రమే. ఈ శక్తి ఏలా ఉందో, ఎలాంటి రూపం కలిగి ఉందో ఎవరికి తెలియదు. అయితే, దేవుడిని తెలుసుకునే మార్గమే భక్తి.

భక్తి అనేది మనసు పలికే ప్రేమ, భయం, బాధ, కామం, క్రోధం వంటి అనేక భావనలలో ఒకటి. ఈ భావనలు ప్రతియొక్క మనస్సులో ఉంటాయి కానీ, వాటిని అనేక మలిన భావనలు కప్పబడి ఉంటాయి. ఈ మలిన భావనలను తొలగించగలిగే ప్రదేశం దేవాలయం. వాటిని తొలగించడం ద్వారా ప్రకాశవంతమైన భక్తి మన మనస్సులో వెలుగుతుంది. భక్తి మరియు దైవత్వం భక్తి అంటే ఏమిటో కాదు, మనలో ఉన్న సుగుణం. మనకు తెలియకుండానే మనలో ఉండే శక్తి. ఈ శక్తి ప్రతివ్యక్తిలో ఉంది, దానిని బయటకు తీసే ప్రక్రియే దైవం, దేవుడు. అందరం ఒక తేజస్సుతోనే పుట్టాం. జీవితపు ఆరంభ సంవత్సరాలలో, మనలో దైవత్వం ఉందనే విషయం మనకు తెలియదు. కానీ, దానిని గుర్తించి భావించినప్పుడు మాత్రమే ఆ తేజస్సు వెలుగుతుంది. మనలో సహజంగా ఉండే ఈ వెలుగును ఎప్పుడైనా కనుగొనవచ్చు, వెలిగించవచ్చు. ఇది మన విలువలు, సుగుణాలను స్వయంగా గుర్తించినప్పుడే సాధ్యం. దైవ అన్వేషణ మరియు స్ఫూర్తి మనలోని సుగుణాల తేజస్సును చూసి స్ఫూర్తి పొంది, మనలో ఉన్న గొప్పదనాన్ని గుర్తించడం భక్తి. మీరు ఇతరులలో కనిపించే సుగుణాలను మెచ్చుకోవచ్చు, వారిని ప్రత్యేకమైన వారిగా ప్రశంసించవచ్చు. కానీ అదే గొప్పతనం మీలో కూడా ఉంటుంది."

ఈ మహాదేవుని అనుగ్రహం మనపై ఉంటుందని ఆశిస్తూ...

వ్యాసకర్త
నరేష్ దండు



# మహాశివరాత్రి సందర్భంగా వాసవి యువసేన సేవా కార్యక్రమాలు





**నాగర్ కర్నూల్, ఫిబ్రవరి 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
మహాశివరాత్రి సందర్భంగా వాసవి యువసేన ఆధ్వర్యంలో ఎండబెట్ల భీమారం గ్రామంలోని శివాలయంలో పండ్లు మరియు ప్రసాద పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సేవా కార్యక్రమాన్ని వాసవి యువసేన ప్రెసిడెంట్ చెవ్వ ప్రమోద్ కుమార్ మరియు మలిపెద్ది చంద్రశేఖర్ నేతృత్వంలో నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున హాజరై, స్వామివారి దర్శనం చేసుకుని ప్రసాదాన్ని స్వీకరించారు. భక్తుల సౌకర్యార్థం అన్ని రకాల సదుపాయాలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో చెవ్వ ప్రమోద్ కుమార్, చంద్రశేఖర్, ప్రసాద్, భాను, రమేష్, రాజు, భాస్కర్, శంకర్, బాల గౌడ్, ప్రదీప్ తదితరులు పాల్గొని భక్తులకు సేవలందించారు. చెవ్వ ప్రమోద్ కుమార్ మాట్లాడుతూ, "సామాజిక సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలి. భక్తుల సేవే పరమ ధర్మం" అని తెలిపారు.ద

## శివాలయాల్లో మహాశివరాత్రి ప్రత్యేక పూజలు



**హైదరాబాద్,ఫిబ్రవరి 26(నీలగిరి ఎక్స్ ప్రెస్ )**
సందర్భంగా ఆలయాలకు భక్తులు పోటెత్తారు. శివనామస్మరణతో ఆలయాలు మార్మోగాయి. పరమ శివునికి ఇష్టమైన రోజుగా చెప్పుకునే మహాశివరాత్రి రోజున ఇష్ట దైవాన్ని దర్శించుకునేందుకు తెల్లవారు జామునుంచే శివుని దర్శనం కోసం భక్తులు క్యూగట్టారు.మహాశివరాత్రి పర్వదినాన్ని పరిష్కరించుకొని రాగినేడులోని శ్రీ స్వయంభూ నాగలింగేశ్వర స్వామికి పంచామృతాలతో అభిషేకము కావించి.... ముక్కంటిని దర్శించుకుని ఆయన ఆశీస్సులు అందుకున్న అనంతరం దేవాలయ నిర్మాణ కమిటీ సారధి, తెలంగాణ రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ పూర్వపు చైర్మన్ కోలేటి దామోదర్ తో వైశ్య కిరణం పత్రిక సంపాదకులు బళ్ళు చంద్ర ప్రకాష్ గుప్తా ఉన్నారు.

# కేఎల్ఐ కాల్వ బ్రిడ్జి నిర్మాణంలో నిర్లక్ష్యం తో రోడ్డు ప్రమాదాలు



**మాడుగుల, ఫిబ్రవరి 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
"రంగారెడ్డి జిల్లా, కల్వకుర్తి నియోజకవర్గం, మాడుగుల మండల కేంద్రం నుండి ఆమనగల్‌కు వెళ్ళే ప్రధాన రహదారిలో, అప్పారెడ్డి పల్లి గేటు సమీపంలో కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ కాల్వ బ్రిడ్జి నిర్మాణం జరుగుతున్నప్పుడు ఎలాంటి ప్రమాద హెచ్చరిక బోర్డులు లేదా రేడియం బోర్డులు ఏర్పాటు చేయకపోవడం వలన రాత్రి సమయంలో ద్విచక్ర వాహనదారులకు ప్రమాదాలు జరుగుతున్నాయి," అని కల్వకుర్తి అసెంబ్లీ బిజెపి సోషల్ మీడియా కన్వీనర్ మెట్టు శ్రీనివాస్ గౌడ్ అన్నారు. అధికారులపై విమర్శ "ఇప్పటికే రెండు మూడు ప్రమాదాలు జరిగాయి. కాంట్రాక్టర్ ప్రభుత్వ సూచనలను పాటించకపోవడం వల్లే ఈ ప్రమాదాలు జరుగుతున్నాయి. నిన్న రాత్రి బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన జెల్ల చంద్రయ్య మరియు అతని అక్క రాగమ్మ, అమనగల్ వెళ్ళే సమయంలో బ్రిడ్జి వద్ద ప్రమాదానికి గురయ్యారు. ఈ ప్రమాదానికి కారణం కాంట్రాక్టర్ నిర్లక్ష్య ధోరణే," అని మెట్టు శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు. తక్షణ చర్యలపై డిమాండ్ "తక్షణమే స్థానిక ఎమ్మెల్యే స్పందించి అధికారులపై, కాంట్రాక్టర్ పై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాం. ఈ ప్రమాదాలను నివారించేందుకు వెంటనే ప్రమాద హెచ్చరిక బోర్డులు మరియు రేడియం బోర్డులు ఏర్పాటు చేయాలని, ప్రజల భద్రతకు ప్రాముఖ్యత ఇవ్వాలని కోరుతున్నాము," అని ఆయన తెలిపారు.

# ఓంకార నామస్మరణతో మార్మోగిన రాచకోండ



**ఇబ్రహీంపట్నం,ఫిబ్రవరి 26 ( నీలగిరి ఎక్స్ ప్రెస్)**
మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా రాచకోండ సంస్థాన్ లోని స్వయంభు దేవాలయం శివనామస్మరణతో మార్మోగింది. మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా రంగారెడ్డి జిల్లా ఆర్యవైశ్య మహాసభ కోశాధికారి, మంచాల మండలం బిఆర్ఎస్ పార్టీ యువజన విభాగం అధ్యక్షులు , వనపర్తి బద్రీనాథ్ గుప్త శివాలయం లో పరమశివుని దర్శించుకోని అభిషేకం పూజ నిర్వహించారు. ఈ దేవాలయం నందు శివ లింగం స్వయంగా వెలిసి ఎంతో ప్రసిద్ధి చెందింది. దాంతో మహా శివరాత్రి రోజు ఈ ఆలయంలోని శివలింగానికి అభిషేకం చేస్తే కోరిన కోర్కెలు తీరుతాయని నమ్మకం. ఈ కారణంతో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అభిషేకాలు చేశారు.

# పరమ శివుని ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి





**– ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి**

**యాచారం,ఫిబ్రవరి 26 (నీలగిరి ఎక్స్ ప్రెస్)** : హిందూ ప్రజలందరూ మహాశివరాత్రి పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి అన్నారు. నియోజకవర్గ ప్రజలందరికీ మహాశివరాత్రి పర్వదినం ప్రజల జీవితాల్లో వెలుగు నింపి సుఖ సంతోషాలతో ఉండాలని శుభాకాంక్షలు తెలుపుతున్నట్లు ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి అన్నారు.మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని యాచారం మండలం లోని నందివనపర్తి గ్రామం లో నందిశ్వర ఆలయం మరియు శివాలయం లో ప్రత్యేక దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి తీర్థప్రసాదాలను సేకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.... ప్రజలందరూ స్వామివారి ఆశీస్సులతో సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు . ఈ కార్యక్రమంలో యాచారం మండలం మాజీ ఎంపీపీ రాచర్ల వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నరసింహ , నంది వనపర్తి మాజీ సర్పంచ్ ఉదయశ్రీ , మేడిపల్లి మాజీ ఎంపిటిసి మోటి శ్రీశైలం, రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ మాజీ అధ్యక్షులు లిక్కి వెంకటరెడ్డి , ఉప్పల భాస్కర్ గుప్త, బిళ్ళ కంటి శేఖర్ రెడ్డి , కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



పూజా కార్యక్రమం లో పాల్గొన్న ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి స్వామివారిని

# సత్యాంజనేయ స్వామి ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్టాపనలో పాల్గొన్న సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి





**కడ్తాల, ఫిబ్రవరి 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

కడ్తాల మండల పరిధిలోని మర్రిపల్లి గ్రామ సత్యాంజనేయ స్వామి దేవాలయంలో ధ్వజస్తంభ ప్రతిష్టాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ మహోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ మరియు టాస్క్ సి ఓ ఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డికి ఆలయ కమిటీ సభ్యులు మరియు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. ధ్వజస్తంభ ప్రతిష్టాపన మహోత్సవంలో పూజా కార్యక్రమాలలో పాల్గొని స్వామి దర్శనముచేసిన సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి, స్వామి ఆశీస్సులతో గ్రామ ప్రజలందరూ ఎల్లప్పుడూ సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు పాలకుర్ల యాదయ్య గౌడ్, కర్ణాకర్ గౌడ్, ఆలయ కమిటీ సభ్యులు బాలమోని సురిగి, జంగయ్య గౌడ్, మార మొని రాములు, సురిగి యాదయ్య గౌడ్, నిరంజన్ గౌడ్, మల్లయ్య గౌడ్, ఉడిత యాదయ్య, మహేష్, యశ్వంత్ రెడ్డి, ఈర్లపల్లి చందు, లక్ష్మణ్, రాఘవేందర్, గడిగే శివ, బాలమోని శివ, శివ అజిత్ మరియు గ్రామస్తులు, ఐక్యత ఫౌండేషన్ సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అనంతరం ఆమనగల్లు మండలంలోని అయ్యసాగర్ క్షేత్రంలో పరమశివునికి అభిషేకం చేశారు.

# మల్లప్ప గుట్ట బ్రహ్మోత్సవాల్లో కళ్యాణోత్సవం

**– పాల్గొన్న అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్**

**తలకొండపల్లి, ఫిబ్రవరి 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

తెలంగాణ రాష్ట్ర ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని, సమృద్ధిగా వర్షాలు కురిసి పాడి పంటలు బాగా పండాలని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆశీర్వదిస్తూ దీవించాలని రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఆకాంక్షించారు. రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండల పరిధిలోని శ్రీ మల్లికార్జున స్వామి మల్లప్ప గుట్ట బ్రహ్మోత్సవాల్లో బుధవారం జరిగిన కళ్యాణోత్సవానికి ముఖ్య అతిథులుగా అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, నాగర్ కర్నూలు ఎమ్మెల్యే రాజేశ్ రెడ్డి, టాస్క్ సీఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, బీసీ కమిషన్ మాజీ సభ్యులు ఆచారి, పొల్యూషన్ బోర్డ్ మెంబర్ బాలాజీ సింగ్ లు హాజరై, స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాలయాల అభివృద్ధికి ప్రాధాన్యత అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ, "రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దేవాలయాల అభివృద్ధికి ప్రత్యేక చొరవ చూపుతున్నారు. మల్లప్ప గుట్ట మల్లికార్జున స్వామి దేవాలయాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం నిధులు కేటాయించేలా కృషి చేస్తాను," అని తెలిపారు.



సీఎం పై ఆశీస్సులు "ప్రజలు ఎల్లవేళలా కాంగ్రెస్ పార్టీపై తమ ఆదరాభిమానాలు కొనసాగించాలని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆశీర్వదించాలని కోరుకుంటున్నాను. ఆరు గ్యారెంటీ పథకాలు అమలు జరగాలంటే రేవంత్‌కు భగవంతుడి ఆశీస్సులు అవసరం," అని ఆయన అన్నారు. మల్లప్ప గుట్ట అభివృద్ధి కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ, "మల్లప్ప గుట్ట అభివృద్ధి కోసం ట్రస్ట్ సభ్యులు ఎంతో కృషి చేస్తున్నారు. ప్రభుత్వ సహకారం ఉంటే మరింత అభివృద్ధి సాధ్యం అవుతుంది," అని అన్నారు. భక్తుల సౌకర్యం నాగర్ కర్నూలు ఎమ్మెల్యే రాజేశ్ రెడ్డి మాట్లాడుతూ, "మల్లప్ప గుట్టకు వచ్చే రహదారిని బీటీ రోడ్డుగా మార్చి భక్తుల ఇబ్బందులు తొలగించాలని," ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యులు శ్రీనివాస్ గౌడ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు డోకూరు ప్రభాకర్ రెడ్డి, శతాబ్ది టౌన్షిప్ మేనేజింగ్ డైరెక్టర్ కాసు శ్రీనివాస్ రెడ్డి, ఏఎంసీ చైర్మన్ గీతా నరసింహ, వైస్ చైర్మన్ భాస్కర్ రెడ్డి, ఆలయ ట్రస్ట్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఆంజనేయ స్వామి కళ్యాణోత్సవంలో పాల్గొన్న వ్యవసాయ కమిషన్ సభ్యులు కేవీఎన్ రెడ్డి

**వంగూర్, ఫిబ్రవరి 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

వంగూరు మండల కేంద్రంలోని కొల్లారెడ్డిపల్లి గ్రామంలోని ఆంజనేయ స్వామి దేవాలయంలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆంజనేయ స్వామి కళ్యాణోత్సవంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తిశ్రద్ధలతో రాష్ట్ర ప్రజలు, రైతులు ఆయురారోగ్యాలతో ఉండాలని భగవంతుని కోరుకున్నారు. రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యులు కేవీయన్ రెడ్డి మాట్లాడుతూ, రైతులు సుభిష్టంగా ఉన్నప్పుడే దేశం బాగుంటుందని, అప్పుడు మాత్రమే దేశ పురోగతికి ముందడుగు పడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వేమారెడ్డి అనిల్, రాఘవేందర్, బొజ్జ



కృష్ణారెడ్డి, గ్రామస్తులు మరియు ఇతరులు పాల్గొన్నారు.

# యువత క్రీడల్లో రాణించాలి



**నల్గొండ, ఫిబ్రవరి 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

నల్గొండ జిల్లా దేవరకొండ మండలం శేరిపల్లి గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ టోర్నమెంట్‌ను శేరిపల్లి మాజీ ఎంపీటీసీ రామావత్ నర్సింహ్మా నాయక్ మరియు పెద్దతండా మాజీ సర్పంచ్ రామావత్ తుల్చియా నాయక్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, క్రీడలు మానసిక ఉల్లాసం మరియు ఆరోగ్యాన్ని కలిగిస్తాయని, యువత క్రీడల్లో రాణించాలనే ఆశయం ఉందని తెలిపారు. తమ వంతుగా క్రీడలకు కావాల్సిన సహాయం చేస్తామని హామీ ఇచ్చారు.

# మహా శివరాత్రి పర్వదినం పురస్కరించుకొని ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ప్రత్యేక పూజలు



**యాచారం,ఫిబ్రవరి 26 (నీలగిరి ఎక్స్ ప్రెస్ )**

–మహా శివరాత్రి పర్వదినం పురస్కరించుకుని బుధవారం ఆలయాలలో భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు.యాచారం మండలంలోని గున్గల్ గ్రామాల్లోని శివాలయాల్లో ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాలు శివనామస్మరణతో మారుమోగాయి.ఆలయాలకు భక్తులు పోటెత్తడంతో ఆలయాలు కిటకిటలాడాయి.అనంతరం గడ్డమల్లాయ గూడ మాజీ సర్పంచ్ గుండ్లపల్లి సురేందర్ రెడ్డి ఎమ్మెల్యే కు శాలువాతో సన్మానించి ఆహ్వానించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.... దేవాలయాలు మానసిక ప్రశాంతతకు నిలయాలు అన్నారు.నిత్య జీవితంలో వారానికి ఒక్కసారైనా దేవాలయాల్లో గడపాలని సూచించారు.ఈ యొక్క కార్యక్రమంలో గడ్డ మల్లయ్య గూడ గ్రామ శాఖ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఇక్కే శరమంద,మాజీ సర్పంచ్ ఇక్కె మల్లేష్,యార అశోక్,ఆచ్చన యాదయ్య,యార జంగయ్య,పాండు రంగారెడ్డి,బీరప్ప,మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా మహాశివరాత్రి వేడుకలు..



**యాచారం,ఫిబ్రవరి 26 (నీలగిరి ఎక్స్ ప్రెస్ )**

హరహర మహాదేవ ... శంభో శంకర అంటూ శివ నామస్మరణతో నీలకంఠ స్వామి ఆలయాలు మారు మోగాయి. మహా శివరాత్రి పర్వది నాన్ని పురస్కరించుకొని మహా శివుడికి భక్తజనం నీరాజనం పలికింది. యాచారం మండలం నక్కర్త మేడిపల్లి లో పురాతన శివాలయంలో నంది ,శివలింగం వీరభద్ర స్వామి వారికి అభిషేకాలు అర్చనలు పూజలు నిర్వహించారు నక్కర్త యువకులు. ఈసందర్భంగా వంగూరి జంగయ్య, మాట్లాడుతూ... నక్కర్త లో ఉన్న పురాతన శివాలయంలో కొలువుదీరిన నందీశ్వరుడు అతిపెద్ద శివలింగం, వీరభద్ర స్వామి దేవాలయం పునర్ నిర్మాణం చేసి పూర్వ వైభవం తీసుకొస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కలకొండా శివ కుమార్,ముంత శ్రీను, బనే గణేష్, నవీన్, ముంత శివలింగం,బైకని తిరుమలేష్, తదితరులు ఉన్నారు.

# మహాశివరాత్రి సందర్భంగా గిద్దబండ శివాలయంలో కేవీఎన్ రెడ్డి ప్రత్యేక పూజలు




**వంగూర్, ఫిబ్రవరి 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

వంగూరు మండల కేంద్రంలోని కొండారెడ్డి పల్లి గ్రామంలో గిద్దబండ శివాలయంలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యులు కె.వి.యన్. రెడ్డి కళ్యాణోత్సవంలో పాల్గొన్నారు. ప్రజల సుఖం కోసం ప్రార్థనలు రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండాలని, ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, రాష్ట్ర ప్రజలు, రైతులు మరియు కొండారెడ్డి పల్లి గ్రామ ప్రజలు ఆయురారోగ్యాలతో ఉండాలని శివాలయంలో భగవంతుని ప్రార్థించారు. కార్యక్రమంలో పాల్గొన్న వారెవరో ఈ కార్యక్రమంలో గౌతమ్ రెడ్డి, వేమారెడ్డి, చందు, వంగూరు మాజీ ఎంపీటీసీ రమేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.